బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభానికి తరలండి..

కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

మియాపూర్,డిసెంబరు 8: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం మైసమ్మగూడలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోనిగులాబీ శ్రేణులు భారీగా తరలాలని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవీరంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె స్థానికంగా మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనకు మాజీ సీఎం కేసీఆర్ దీక్ష విరమించిన రోజైన డిసెంబర్ 9న పార్టీ కార్యాలయం ప్రారంభం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తుండటం అత్యంత గౌరవప్రదమని పేర్కొన్నారు. పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. డివిజన్ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు.

కూకట్‌పల్లి జోనల్ ఆఫీస్‌లో నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 8 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలని జోనల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మూసాపేటలోని జోనల్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ప్రజావాణిలో జడ్సీ అపూర్వ్‌చౌహాన్‌తోపాటు జోనల్ అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో ప్రజావాణి కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీలు వంశీకృష్ణ, గంగాధర్ పేర్కొన్నారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

● పాల్గొన్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, డిసెంబర్ 8 : ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటలో కింగ్ ఆఫ్ కింగ్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యఅతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు యేసును తలుస్తూ పాడిన పాటలు ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశాయి. చిన్నారులు సైతం యేసును స్మరిస్తూ నృత్యాలు చేశారు. అనంతరం పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిరుపేదలు, దివ్యాంగులకు 200 మందికి దుప్పట్లు, దుస్తులను స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాస్టర్ సుధాకర్ నిరుపేద అయినప్పటికీ పేదలు, దివ్యాంగులకు చేయూతనందించడం అభినందనీయమన్నారు. దేవుడిని స్మరిస్తూ పేదలకు సేవలందించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు కర్రె జంగయ్య, సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, నర్సింగ్,హరినాథ్, సత్యనారాయణ, బాలరాజ్, సరోజ పాల్గొన్నారు.

హస్మత్‌పేటలో సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు, తదితరులు

దివ్యాంగులకు దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, పాస్టర్ సుధాకర్

మహనీయుల భవన నిర్మాణానికి కృషి

● కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్,బాబూజ్జీవన్‌రామ్ భవన నిర్మాణానికి కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదికచైర్మన్ మేకల నగేశ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో చర్చించి, భవన నిర్మాణం చేపట్టేలా తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వారికి సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జలడం చంద్రయ్య, బురికి రాములు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

శామీర్‌పేట: మండలంలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన కట్ట గోపాల్‌స్వామి బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టిన 18వ మహాపడి పూజలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ అయ్యప్ప మాలాధారణ స్వాములు,భక్తులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

కీసర: మండలలోని చీర్యాల్ గ్రామంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, గ్రామ మాజీ సర్పంచ్ పూలగూర్ల లావణ్య భర్త శ్రీనివాస్ 18వ మహాపడిపూజ ఆదివారం ఘనంగా జరిగింది. కొడగండ్ల శ్రీరామ్‌శర్మ గురుస్వామి వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

ప్రగతినగర్‌లో ఘనంగా గీతా జయంతి

గీతాజయంతి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, నిర్వాహకులు

దుండిగల్,డిసెంబర్ 8 : భగవద్గీత ఈ భూమిపై అవతరించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రగతినగర్‌లో పట్టాభిరామాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గీతా జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భగవద్గీత, కృష్ణపూజ, భగవద్గీత శ్లోకాల సామూహిక పారాయణంతో పాటు చిన్నారులకు క్విజ్, రంగులు పూరించే పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భగవద్గీతా శ్లోకాలను కంఠస్థం చేసిన వారిని సత్కరించారు. అంతకుముందు శ్రీకృష్ణుడి ప్రతిమ భగవద్గీత గ్రంథాలను పల్లకిలో పురవీధుల్లో ఊరేగించారు. గీతా పరివార్ దక్షిణాంచల్ ప్రముఖ్ హరినారాయణ్ వ్యాస్, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి,రాజారెడ్డి, సత్యనారాయణ, అశోక్, రామాంజనేయులు రవివర్మ, హరిత, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కమిటీ రద్దు

నూతనంగా ఎన్నికైన యూనివర్సిటీ జేఏసీ కమిటీ సభ్యులతో బొట్ల భిక్షపతి, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 8 : జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర కమిటీని రద్దు చేసినట్లు జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన సమావేశంలో జేఏసీ నేతలు సమావేశమై... మేజారిటీ సభ్యుల అమోదం మేరకు ప్రస్తుతం కొనసాగుతున్న జేఏసీ రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు తీర్మానించారు. నూతన రాష్ట్ర కమిటీ, వర్సిటీ అనుబంధ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆ బాధ్యతలను జేఎన్‌టీయూహెచ్ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతికి అప్పగించారు.

వర్సిటీ స్థాయి నూతన జేఏసీ

అనంతరం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ స్థాయి నూతన జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. వర్సిటీ జేఏసీ ప్రెసిడెంట్‌గా ఆదిమల్ల పవన్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అభిరామ్, తేజ, తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం జేఏసీ చైర్మన్ భిక్షపతి మాట్లాడుతూ.. నూతన కమిటీలను ఏర్పాటు చేసే వరకు.. వర్సిటీ జేఏసీ కమిటీ పేరును, హోదాను వాడవద్దని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు బల్గర్ సందీప్, అంబటి తేజ, దాస్యం విక్రాంత్ ఉన్నారు.

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రతిష్ఠ పనులు ప్రారంభం

చర్లపల్లి, డిసెంబర్ 8: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్దచర్లపల్లి చౌరస్తాలో ఆదివారం చర్లపల్లి మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్,బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రతిష్ఠ పనులను ప్రారంభించారు. సంఘం నాయకులు జనార్దన్, యాదగిరి, నర్సింగ్‌రావు, గిరిబాబు, రమేశ్, కుమార్, నగేశ్, సురేశ్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

'టాప్ హ్యాట్స్ అండ్ టెయిల్ కోట్స్' గ్రంథావిష్కరణ

ప్రయాగ మోహనమురళీకృష్ణ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 8 : ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీ మోహనకృష్ణ యూరప్ దేశంలో 40ఏండ్ల స్వానుభవాలు, సంఘటనలను వివరిస్తూ విదేశాల్లో స్థిరపడాలనే యువతకు మార్గనిర్దేశం చేసేలా ఒక మంచి గ్రంథం రచించి అందించారని వక్తలు ప్రశంసించారు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం ప్రముఖ రచయిత డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ రచించిన 'టాప్ హ్యాట్స్ అండ్ టెయిల్ కోట్స్' అనే గ్రంథావిష్కరణ జరిగింది. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ప్రసంగిస్తూ విదేశీ వ్యామోహంలో ఉన్న యువతకు ఆలోచనరేకిత్తేంచేలా ఈ గ్రంథం ఉందన్నారు. విదేశాలకు వెళ్లిన వారు పడే ఇబ్బందులను కళ్లకు కట్టినట్లుగా తెలియజేశారని అన్నారు. ప్రముఖ రచయితలు ఓలేటి పార్వతీశం, డాక్టర్ శేషగిరిరావు, భాస్కర్ గడేపల్లి, రామారావు, రచయిత్రులు విజయలక్ష్మి, డాక్టర్ ప్రయాగ రాజ్యలక్ష్మి, శశికళ పాల్గొని రచయిత మోహనకృష్ణ సాహిత్య శైలిని వివరించారు.

బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

మల్కాజిగిరి, డిసెంబర్ 8: అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, స్వామి, శ్రీకాంత్, విజయ సారథి, రఘుపంతులు, వంశీపంతులు, శ్రీనివాస్ పంతులు, రమణ పంతులు, రాజు, శివరామకృష్ణ, వెంకటరామిరెడ్డి, సురేందర్ రెడ్డి, రామందర్‌రావు, వంశీ పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ భవనంలో దివ్యాంగుల దినోత్సవం

వేడుకలను ప్రారంభిస్తున్న కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ తదితరులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 8 : సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవనంలో ఆదివారం వేల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజెబుల్డ్ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ, ఏఎంసీ కృష్ణ, రిటైర్డ్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఎన్ఎఫ్‌బీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం 120 మంది దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంజయ్యగౌడ్, నరేందర్‌రెడ్డి, యాదయ్య, సత్యం, శేఖర్‌గౌడ్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, పీజే ప్రకాశ్, సుధాకర్‌దేవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయిస్తా..: కార్పొరేటర్

రాజీవ్‌గాంధీ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్‌తో స్థానికులు

మియాపూర్ , డిసెంబరు 8 : ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ రాజీవ్‌గాంధీ నగర్‌లో కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో పెండింగ్ ఉన్న పనులన్నింటినీ పూర్తి చేయిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తన దృష్టికి వచ్చాయని, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, భాస్కర్, పోశెట్టి, మురళి, ఇంతియాజ్, రవి, ధనుంజయ, గుడారయ్య, సురేశ్, రాము, డాక్టర్ చంద్రశేఖర్, సతీశ్, ఫయాజ్, బాలాజీ, వినోద్, శ్రీనాథ్, నాగరాజు, అరవింద్ పాల్గొన్నారు.

మందకృష్ణ నాయకత్వంలోనే వర్గీకరణ సాధిస్తాం..

నిజాంపేట్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మేకల నాగేశ్ మాదిగ

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిసిన మేకల నాగేశ్ మాదిగ తదితరులు

దుండిగల్,డిసెంబర్ 8 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ నాయకత్వంలోనే ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మేకల నాగేశ్ మాదిగ అన్నారు. ఆదివారం ఆయన పలువురు నాయకులతో వెళ్లి మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేకల నాగేశ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారని, నిజమైన అంబేద్కర్ వాదులైతే అయా ఉపకులాలల్లో ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి, వర్గీకరణ ఫలాలను జనాభా ధామాషా ప్రకారంగా పంచుకోవడానికి ముందుకురావాలన్నారు. మందకృష్ణ మాదిగ గత 30 ఏండ్లుగా న్యాయ పోరాటం చేసి సాధించిన వర్గీకరణను కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మాల సోదరులు ఇకనైనా స్వార్థాన్ని వీడి అన్నదమ్ముల్లా కలిసి వర్గీకరణ ఫలాలను పంచుకునేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జలగం చంద్రయ్యమాదిగ, బురికి రాములు మాదిగ, అబ్రహంమాదిగ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నేడు మత్స్యకారుల చలో అసెంబ్లీ

దుండిగల్, డిసెంబర్ 8 : కాంగ్రెస్ పాలనతో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాలపై మత్స్యకారులు పోరాటాలకు సిద్ధమైనట్లు మేడ్చల్ డీఎఫ్‌సీఎస్ చైర్మన్ మన్నె రాజుముదిరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలోని 32 జిల్లాలకు సొసైటీ ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. కేవలం 50 శాతం మాత్రమే చేప పిల్లల పంపిణీ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి ఏలోకి మార్చేలా అసెంబ్లీలో బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో మత్స్యకారుల అభివృద్ధికి నిధుల కేటాయించాలన్నారు. సోమవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మత్స్యకారులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తున్నట్లు పేర్కొన్నారు.

కీసరగుట్టలో మృత్యుంజయ హోమం

కీసర, డిసెంబర్ 8: దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశానుసారం కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు.అదేవిధంగా కీసరగుట్టలో స్వామివారికి సోమవారం గర్భాలయంలో మహా న్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించనున్నారు.

'మాలలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'

ఖైరతాబాద్, డిసెంబర్ 8 : మాలలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మాల మహిళా చైతన్య వేదిక అధ్యక్షులు అంజలి కుమారి అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ తుమ్మలబస్తీలో ఆమె మాట్లాడుతూ.. మాలల సింహగర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా మాలలు స్వచ్ఛందంగా వచ్చారని, విజయవంతాన్ని చూసి ఓర్వలేకనే మందకృష్ణ అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు

అభివృద్ధి పనుల్లో నాణ్యత డొల్ల!

● నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్
● అమ్యామ్యాలతో పర్యవేక్షణ చేపట్టని అధికారులు

నిజాంపేట్‌లోని పంచాయతీ కార్యాలయం వద్ద నాసిరకంగా చేపట్టిన భూగర్భడ్రైనేజీ పనులు

బాచుపల్లి శ్రీసాయినగర్‌లో పాత మ్యాన్‌హోల్స్‌పై కొత్త పనులు చేపట్టిన

దుండిగల్, డిసెంబర్ 8 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంలేదని స్థానికులు పేర్కొంటున్నారు. కోట్లా దిరూపాయల నిధులతో చేపట్టిన భూగర్భడ్రైనేజీ విస్తరణ, నూతన పైప్‌లైన్ పనుల్లో గుత్తేదారులతో కలిసి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని అధికారులు జేబులో వేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా చేపడుతున్న భూగర్భడ్రైనేజీ, సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత మచ్చుకైనా కనబడటంలేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఇంజినీరింగ్ ఉన్నతాధికారి ఒకరు తనకు నచ్చిన గుత్తేదారుకు పనులు అప్పగించి సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు బాచుపల్లి శ్రీసాయినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన భూగర్భడ్రైనేజీ, సీసీ రోడ్డు పనులతో పాటు నిజాంపేట్‌లోని పంచాయతీ కార్యాలయం రోడ్డులో జరుగుతున్న భూగర్భడ్రైనేజీ పనులే నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు.

పైన పూత.. లోపల రోత

శ్రీసాయినగర్‌లో ఇటీవల చేపట్టిన భూగర్భడ్రైనేజీ విస్తరణ పనులకు కార్పొరేషన్ నుంచి కోట్ల రూపాయల నిధులు కేటాయించారు. గతంలో ఉన్న మ్యాన్‌హోల్స్‌లో కుండీలను మార్చకుండానే సీసీ రోడ్డుకు సమానంగా ఆరు అంగుళాల ఎత్తు మాత్రమే కొత్తగా నిర్మించిన గుత్తేదారు మొత్తం మ్యాన్‌హోల్‌ను నూతనంగా నిర్మించినట్లు పైన సిమెంట్ పూసి బిల్లులు చేయించినట్లు ఆరోపణలున్నాయి. భూగర్భడ్రైనేజీ పనులు నూతనంగా చేపట్టినవా..? మెయింటెనెన్స్ పనులా...? అనేది స్పష్టత నివ్వకుండా అడిగిన వారిపైనే ఎదురుదాడికి దిగుతున్నట్లు సమాచారం.

అధికారులకు పార్టీలు.. విదేశీ పర్యటనలు!

కాగా గతంలో ఇక్కడ ఏఈగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఓ అధికారితో పాటు కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు సంబంధిత కాంట్రాక్టర్ తరచూ పబ్బుల్లో పార్టీలు ఇవ్వడం, విదేశీట్రిప్పులకు తీసుకెళ్లి తనకు అనుకూలంగా మలుచుకుంటాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు సిబ్బంది,కొందరు అధికారులకు ఖరీదైన గిఫ్ట్‌లను అందజేస్తాడనే చర్చ జరుగుతున్నది. ఫలితంగానే సదరు గుత్తేదారుకు అనుకూలంగా ఎంబీలు చేస్తూ పనుల నాణ్యతను గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా అభివృద్ధి పనుల్లో చోటుచేసుకుంటున్న అవినీతిపై సమగ్రవిచారణ జరపాలనే డిమాండ్ సర్వత్రా వినిపిస్తున్నది.

విచారణ జరిపించాలి

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రతిదానికి నాకెంత..? నీకెంత..? అనే ధోరణిలో జరుగుతున్నాయని బీజేపీ నిజాంపేట అధ్యక్షుడు భిక్షపతియాదవ్ పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించకుండా నాసిరకంగా చేపడుతున్నారని ఆరోపించారు. నిజాంపేట్ పాత గ్రామపంచాయతీ సమీపంలోని బొడ్రాయి నుంచి వాటర్‌ట్యాంక్ వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులు ఇందుకు ఉదాహరణగా నిలుస్తాయంటున్నారు. సంబంధిత అధికారులు విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈసీఐఎల్‌లో పరుగుల పండుగ

ఈసీఐఎల్‌లో వేకువజామున పరుగుల పోటీని ప్రారంభిస్తున్న దృశ్యం

కాప్రా, డిసెంబర్ 8: కాప్రాసర్కిల్ ఈసీఐఎల్ పారిశ్రామికవాడలో ఆదివారం ఉదయం మారథాన్ పరుగుల పండుగ 'ఈసీఐఎల్ రన్నర్స్-రన్ జాతర 2024' నిర్వహించారు. 5 కి.మీ, 10కి.మీ, 20.కి.మీ. విభాగాల్లో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జాతీయ క్రీడాకారులతో పాటు స్థానిక క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం వేకువజామున ఈసీఐఎల్ పారిశ్రామికవాడలో పరుగు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులతో సందడి నెలకొంది. క్రీడాకారులందరికీ టీషర్ట్‌లు, విజేతలకు మెడల్స్ అందజేశారు. ఈసీఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ భవనం నుంచి పోటీలు ప్రారంభమయ్యాయి. వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 8 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు కింది విధంగా ఉన్నాయి.(కేజీ-రూపాయలలో..) టమాట 27, వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 35, కాకరకాయ 20, బీరకాయ 38, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 47, కాలీఫ్లవర్ 30, దొండ 28, చిక్కుడు 45, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 41, క్యాప్సికం 55, ఆలుగడ్డ 35, కీరదోస 23, దోసకాయ 23, సొరకాయ 20, పొట్లకాయ (1) 20, కందగడ్డ 55, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 49, చింతకాయ-, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 30 నుంచి 40, మునగకాయ(1) 18 నుంచి 20, పచ్చి బఠాని 75, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 400, చింతపండు 140, కరివేపాకు 100 రూపాయలుగా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు

కొండాపూర్, డిసెంబర్ 8 : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పద్మావతి ఆర్ట్ అకాడమీ, సూత్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువులు కార్తతి కిరణ్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో మోదమున, వినాయక కౌతం, పుష్పాంజలి, హిమగిరితనయే, కొలువై ఉన్నదే, జతిస్వరం, దశావతారం, పలుకే బంగారమాయెనా, నమశ్శివాయతే, తిల్లాన తదితర అంశాలను వేద, సహస్ర, జాహ్నవి, శ్రీఅంవిత, పర్ణిక, లక్ష్మి అభిష్ట, లక్ష్మి అక్షిత, లలిత శిరీష, హాస్య పద్మావతి, సౌగంధికలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

ఫుట్‌కేసర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఫుట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 8: ఫుట్‌కేసర్ పట్టణంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు గాను నిధులు మంజూరు చేయాలని పట్టణ జేఏసీ సభ్యులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌లను కలిసి ఆదివారం వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సార శ్రీనివాస్ గౌడ్, బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, సభ్యులు సి